క్లుప్తంగా

మిట్స్‌లో మోడల్ ఈఏపీసెట్

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మోడల్ ఈఏపీసెట్ నిర్వహించారు. 1024 మంది ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. పరీక్ష ఆన్‌లైన్ ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ఈఏపీసెట్ ఆన్‌లైన్ పరీక్షపై ముందస్తు అవగాహన కోసం నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటలకు మరోసారి ఈ పరీక్షను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగల వారు హాజరుకావచ్చని తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె : పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉత్తమప్రతిభ కనపరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఎస్.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన ఏఐట్రూయిస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్.లిమిటెడ్ తరపున హెచ్ ఆర్ మేనేజర్లు ఎస్.దామోదర్, ఎం.భరతసింహారెడ్డి, పి.దినేష్‌కుమార్‌రెడ్డిలు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. డ్రైవ్‌కు 200 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో 30 మంది విద్యార్థులు బెంగళూరు, హోసూరులో బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేసేందుకు ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ.2 నుంచి 2.60 లక్షల వేతనం లభిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

అనాథలకు పండ్లు, స్వీట్లు అందజేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు రూపారెడ్డి శనివారం తన పుట్టిన రోజు వేడుకలను శబరి అనాథ ఆశ్రమంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వారికి పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, భాస్కర్, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



విద్యార్థినిని తనిఖీ చేస్తున్న పోలీసులు

మదనపల్లె సిటీ: పాలిసెట్–2024 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శనివారం మదనపల్లెలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీల్లో పాలిసెట్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు.పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను పోలీసులు క్షుణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంకు పంపారు. విద్యార్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు లోపలికి అనుమతించలేదు. ప్రభుత్వ బీటీ కాలేజీలో 701 మందికి గాను 610 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో 941 మందిగాను 823 మంది హాజరయ్యారు. జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు తనిఖీ చేశారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. కోళ్లబైలు పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన రామాంజనేయులు కుమార్తె చందనప్రియ (20)ను ఏడాదిక్రితం కర్నాటక రాష్ట్రం గౌనిపల్లెకు సమీపంలోని కోడిపల్లెలో శివరాజుకు ఇచ్చి వివాహం చేశారు. నాలుగు నెలల అనంతరం భర్తతో విభేదాల కారణంగా చందనప్రియ పుట్టింటికి వచ్చి గత ఎనిమిది నెలలుగా ఇక్కడే ఉంటోంది. ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి రామాంజనేయులు శుక్రవారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విశ్వంలో 2కె24 ఆడియోస్ వేడుక



జ్యోతి వెలిగిస్తున్న బోలే షావలి, బాలు

కురబలకోట: విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో ఆడియోస్ 2కె24 వేడుకలు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి శనివారం తెలిపారు. ముఖ్య అతిధులు మ్యూజిక్ డైరెక్టర్ బోలే షావలి, టాలివుడ్ నృత్య దర్శకుడు బాలు మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైనదన్నారు. భవిష్యత్తును జీవితాన్ని నిర్దేశిస్తుందన్నారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బేబీ.ధనశ్రీ తన డ్యాన్స్‌తో అలరించారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలి

- జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి
- నిమ్మనపల్లెలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి,
- మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి





నిమ్మనపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నిస్సార్ అహ్మద్, దేశాయి తిప్పారెడ్డి, నాయకులు, రామసముద్రం: వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు

నిమ్మనపల్లె : రాష్ట్రం బాగుండాలంటే ప్రజా ప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాలని మదనపల్లె నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నిమ్మనపల్లెలో మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కే సదాశివరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ నరసింహులు, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, నాయకులు రమణారెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, రఘునాథ రెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పెద్ద మాదిగ పల్లెలోని మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అనంతరం నిమ్మనపల్లె, పెద్ద మాదిగ పల్లె,గంగాపురం పల్లె, నాగులయ్య గారి పల్లె, అడుసు పల్లె, దేవళం కురపల్లె, బోడు మల్లయ్య గారి పల్లె కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, ఐదేళ్లల పాలనలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారని, ప్రజలు కూడా ఆయన పాలనకు వందకు వంద మార్కులు వేశారన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వ లేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా కలిసి లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. గత టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మంచి జరిగితేనే ఓటు వేయమని అడిగే ధైర్యం ఒక్క ముఖ్యమంత్రి జగనన్నకే ఉందని, అలా అడుగుతున్నారంటే తమ ప్రభుత్వం చేసిన మంచి మీద ఆయనకు అంత నమ్మకమున్నారు. ఎన్నికల వేళ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. వారిచ్చే డబ్బులు, మద్యం తీసుకుని, ఓటు వేస్తే ఐదేళ్లు నరకం అనుభవించాల్సి ఉంటుందన్న విషయం మర్చిపోవద్దన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి ఫ్యాన్ గుర్తుకే ఓటువేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి,జేసీఎస్. కన్వీనర్ రామమోహన్ రెడ్డి, ఆర్ బి కే చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం మహదేవ రెడ్డి, మాజీ సర్పంచ్ రుకియా బేగం నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, రెడ్డి భాస్కర,గడ్డం నరసింహారెడ్డి, ఎర్రయ్య, ఈశ్వర, రామారావు, హోటల్ రఫీ, నూర్ మొహిద్దీన్ ఖాన్, ఖాసిం పాల్గొన్నారు.

జక్కన్నవారిపల్లెలో 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరిక

రామసముద్రం: రామసముద్రం మండలంలోని ఎలకపల్లి పంచాయతీ జక్కన్నవారిపల్లెలో శనివారం రాత్రి 25 కుటుంబాలు టీడీపీలో నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. దాదాపు 60 మంది వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కిరణ్‌కుమార్, వెంకటరమణ, రెడ్డెప్ప, గురుమూర్తి, గంగాధర, శ్రీనివాసులు, గంగులప్ప, ప్రభాకర్, శ్రీనివాసులు, శ్రీరాములు, ఆనంద, నారాయణస్వామి , మునిరాజా, సుబ్రమణ్యం, అప్పయ్యలతో పాటు మరి కొంత మంది పార్టీలో చేరారు. నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ పార్టీని నమ్మి వచ్చిన వారికి ప్రాముఖ్యత కల్పిస్తామన్నారు. వారికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డి ని , ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చరణ్‌కుమార్, విజయ్, ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పిటీసి రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్‌ఎంపీపీ గంగాధరనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ప్రకాష్, రాధారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షంషేర్, హరిప్రసాద్‌నాయుడు, గుణశేఖర్ , రఘునాథరెడ్డి, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

మేనిఫెస్టివల్

విద్యకు ప్రాధాన్యత



మేనిఫెస్టోలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. అమ్మ ఒడి రూ. 17 వేలు పెంచడం, విద్యా దీవెన, వసతి దీవెన, విదేవీ విద్య దీవెనలు కొనసాగించడం వల్ల సామాన్య,మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్య చదవడానికి అవకాశం ఉంది. డిజిటల్ విద్యా రంగాన్ని బలోపేతం చేయడంతో విద్యార్థుల్లో నైపుణ్యత పెరుగుతుంది.

-సుబ్బారెడ్డి, మదనపల్లె

డ్రైవర్లుకు ఎంతో మేలు



వైఎస్సార్ వాహన మిత్ర కొనసాగించడం, సొంత టిప్పర్, లారీ నడిపే వారికి ఈ పథకం వర్తింప జేయడంతో డ్రైవర్లకు మేలు జరుగుతుంది. ఆటో, టాక్సీ, లారీ కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వారికి సౌలభ్యం కల్పించడం సంతోషం.

-షేక్ సుబహాన్, డ్రైవర్,మదనపల్లె

జగన్ చెబితే అమలు గ్యారంటీ

వైఎస్ జగన్ ప్రకటించిన మేనిఫెస్టోలో పథకాల లబ్ధి పెంచారు. జగన్ చెబితే అమలు గ్యారంటీ అన్న నమ్మకం. కొత్తవి కాకపోయినా పాతవాటి ద్వారానే ఎక్కువ ప్రయోజనం పొందేలా చూశారు. ఉన్న పథకాలనే సమర్థవంతంగా నిర్వహించాలని నిధులు పెంచారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పేదలకు ఇండ్లు, పేదల సంక్షేమం, నాడు నేడు, మహిళా సాధికారిత, సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇచ్చారు.

-శంకర్ నాయక్, కురబలకోట మండలం

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



సోంపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు కళ్లారా చూస్తున్నారని, ఎవరు మంచి చేశారో ఆలోచించి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీలోని అడవిచెరువు, భోరేడ్డిగారిపల్లె, చింతావారిపల్లె ,జవకలకోట, రెడ్డివారిపల్లె, బిళ్లూరువారిపల్లె, సోంపల్లెలో ప్రజలను కలుస్తూ ప్రచారం చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని, సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించామన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం మొత్తం సిమెంట్ రోడ్లు , తారు రోడ్లు, అవసరం ఉన్నచోట గుర్తించి పనులు పూర్తి చేయించామన్నారు. కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీదే అన్నారు. కర పత్రాలు పంచుతూ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, జయచంద్ర, ఎంపీటీసీ క్రిష్ణప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

– తిరుపతి ఎస్ఈ కృష్ణారెడ్డి



రామసముద్రం మండలంలో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

రామసముద్రం: వ్యవసాయ రైతులకు అదనపు లోడు కోసం పవన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి డిస్కమ్ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన రామసముద్రం మండలంలో పర్యటించారు. కుదురుచీమనపల్లి, కనగాని, రామసముద్రం సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. అనంతరం సబ్ స్టేషన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. వ్యవసాయ రైతులకు సంబంధించి ఓవర్ లోడ్ కారణంగా చెంబకూరు, ఆర్.నడింపల్లి సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే టి.గొల్లపల్లి సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. అలాగే కొత్తగా వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటి వరకు 16 వేల కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతులకు వ్యవసాయానికి సరిపడ విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. రైతులకు, వినియోగదారులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ యుగంధర్, ఏడి జీవన్‌కుమార్‌రెడ్డి, ఏఇలు రెడ్డికుమార్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు రామసముద్రంలో ఎన్నికల ప్రచారం

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, మంచి కార్యక్రమాలను వివరించనున్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ నేతలు హాజరుకావాలని కోరారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ములకలచెరువు: బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ ప్రజలను కోరారు. శనివారం ములకలచెరువులోని ఒక ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పేదరికం దూరం

– ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ



ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతున్న పెద్దిరెడ్డి కవితమ్మ

తంబళ్లపల్లె: చదువుతో పేదరికం దూరం అవుతుంది. పేదరికం పోవాలంటే ప్రతి కుటుంబంలోను పిల్లలు చదువుకున్నప్పుడే కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందనే ఆశయంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమ్మ–ఒడి పథకం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ తెలిపారు. గోపిదిన్నె పంచాయతీలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బెంగళూరు రియల్టర్ మల్లికార్జునరెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు గుర్తు చేస్తూ రాజంపేట ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా ద్వారకనాథరెడ్డికి ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గోపిదిన్నె మాజీ సర్పంచ్ భర్త సుధాకర్ టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేర్చారు. పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయమ్మ, జ్యోతి నాయకులు నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కరీమ్, ప్రభాకర్‌రెడ్డి, గొర్లమల్లిరెడ్డి, జమాల్‌బాషా, రామూర్తి, రవిశంకర్‌రెడ్డి, శివారెడ్డి, కోటిరెడ్డి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



సంపతికోట పంచాయతీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: అమ్మలారా, తాత లారా, అక్కలారా వైఎస్సార్ సీపీ పాలనలో మీ కుటుంబానికి ఏదో రూపంలో లబ్ధి జరిగి ఉంటుంది. మళ్ళీ ఇలాంటి సంక్షేమ పాలన రావాలన్నా, పథకాలు అమలు చేయాలన్నా వైఎస్సార్‌సీపీకే సాధ్యం. మీరంతా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండలంలోని బూచిపల్లి, సంపతికోట పంచాయతిల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించిన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని, పార్టీలకతీతంగా మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ బేరీజు వేసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు ఓట్ల కోసం ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని, ఎవరూ మోసపోరాదని సూచించారు. కార్యక్రమంలో మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, సుబ్బరాం, పప్పు రాజారెడ్డి, శోభా, శంకర్, ఉమాశంకర్‌రెడ్డి, పీఎస్ మధు, కిట్టన్న, రామిరెడ్డి, మధూకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కుంచే శీనా, అమరనాథ్‌రెడ్డి, కేఎస్ శ్రీనివాస్, శివారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వెంకట్, గిరీస్వామి సుబ్బిరెడ్డి, చౌడప్ప, దీపాల వెంకట్రమణ, పల్లిగడ్డ కిట్టన్న, మంజునాథ్‌రెడ్డి, సాదిక్, మహబూబ్‌బాషా, దండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుండలతో కూల్.. కూల్



మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అంగళ్లు టెర్రకోట నగర్‌లో మట్టి కుండలు

కురబలకోట: వేసవి వచ్చిందంటే జనాలకు మట్టి కుండలు గుర్తుకు వస్తాయి. తరాలు మారుతున్నా ఎంత ఆధునికత చోటుచేసుకున్నా వేసవిలో మట్టి కుండలకు మాత్రం ఆదరణ తగ్గలేదు. వీటిపట్ల ఆసక్తి కనపరుస్తున్నారు. ఇప్పటికే ఎండలు బాగా ముదిరిపోయాయి. ఉక్కపోతతో ఇళ్లల్లో కూడా ఉండలేకపోతున్నారు. ఫ్రిడ్జ్ వాటర్ తాగడం వల్ల కడుపులో చల్లగా ఉంటుంది కానీ అంత ఆరోగ్యకరం కాదని వైద్యులు చెబుతున్నారు. చల్లటి నీటి కోసం మట్టి కుండల కోసం ఆరాటపడతారు. మట్టి కుండలో నీళ్లు ఔషధంగా భావిస్తారు. ఈసారి కూడా మునుపటి కన్నా ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపం తీర్చుకోడానికి జనం మట్టి కుండల వైపు చూస్తున్నారు. కుండలోని నీళ్లు ఉపశమనాన్ని కల్గిస్తాయి. చిత్తూరు జిల్లాలోని పలమనేరు ఘంటావూరు, అన్నమయ్య జిల్లాలోని అంగళ్లు, కంటేవారిపల్లె, సీటీఎంలో రోడ్లు పక్కన స్టాల్స్‌లో విరివిగా వీటిని విక్రయిస్తున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా వీటి సీజన్ నడుస్తోంది. కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా నల్ల, ఎర్ర కుండలను వివిధ డిజైన్లలో వీటిని తయారు చేశారు. ధర కాస్తా ఎక్కువనిపించినా కూడా కుండలు కొని చల్లటి నీళ్లు తాగాలని జనం తాపత్రయపడుతున్నారు.

వంద నుండి రూ. 600 వరకు..



మట్టి కుండలు వంద నుండి రూ.600 చొప్పున విక్రయిస్తున్నాము. మంచి గిరాకి ఉంది. వాహనదారులు, ప్రయాణికులు ఎక్కువగా కొంటున్నారు. మట్టి కుండలో నీళ్లు శ్రేష్టంగా భావిస్తారు. ఆరోగ్యం కూడా. ఈ సీజన్‌లో మొత్తం కుండలే చేస్తున్నాం. ఎన్ని చేసినా హాట్ కేకుల్లా అయిపోతున్నాయి. బతుకుదెరువు ఆశాజనకంగా ఉంది. -ఎం.రాములమ్మ, అంగళ్లు

వివిధ రాష్ట్రాలకు సరఫరా



మట్టి కుండలు, కూజాలు, గ్లాసులు,జగ్గులకు తరగని డిమాండు ఉంది. రాయలసీమ వ్యాప్తంగా వివిధ జిల్లాలతో పాటు హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు కూడా ఇక్కడ నుండి మట్టి కుండలు వెళుతున్నాయి. రోజుకు ఒక్కో స్టాల్ రూ. 2వేల నుండి రూ. మూడు వేలకు పైగా బేరం జరుగుతోంది.

-దుర్గం కళావతి, కురబలకోట

అంగన్‌వాడీల్లో విప్లవాత్మక మార్పులు



మదనపల్లె: చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మాతా శిశు సంరక్షణలో భాగంగా విప్లవాత్మక మార్పులతో బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. నాడు–నేడు పథకాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వర్తింపజేస్తూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు కొత్త భవనాలను నిర్మిస్తున్నారు. పాత కేంద్రాల్లో మరమ్మతులు చేసి ఆధునిక వసతులు కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను అమల్లోకి తీసుకురానున్న నేపథ్యంలో వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్పుచేశారు. గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ సౌకర్యాలు

- గోడలపై రంగురంగుల అందమైన చిత్రాలు...ఆకట్టుకునే ఆటబొమ్మలతో అంగన్‌వాడీ కేంద్రాలు ప్లేస్కూళ్లను తలపిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ ప్లే స్కూళ్లలో నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలన్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సమకూర్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం....

- ఒకప్పుడు పాత ఇండ్లు, అద్దె గదుల్లో నిధులు లేక అరకొర వసతులతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టితో బలోపేతం దిశగా చర్యలు తీసుకోవడంతో పక్కా భవనాల నిర్మాణాలు జరుపుకుంటున్నాయి.ఎంపిక చేసిన కేంద్రాలను మోడల్ సెంటర్లుగా తీర్చిదిద్దడంతో పాటు గోడలపై రంగురంగుల కార్టూన్లు, అక్షరాలు, పదాలు, నేర్చుకునేందుకు అర్థమయ్యే రీతిలో చిత్రాలను వేశారు. ఆటవస్తువులు, టెలివిజన్, బోధనా సామగ్రిని సమకూర్చారు. మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీరు, కుర్చీలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించారు.
- నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలికసదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వం. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నాణ్యంగా కనీస మౌలిక సదుపాయాలను అందించేలా చర్యలు చేపట్టింది.
- ప్రీ స్కూల్ యాక్టివిటీస్ కింద 3ప్లస్ పిల్లలకు పీపీ–1, 4ప్లస్ పిల్లలకు పీపీ–2 కింద నేర్చుకునే విధానాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కిట్లు, వర్క్ బుక్స్ అందిస్తున్నారు. దీంతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలను అందిస్తూ.. అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణా కార్యక్రమాల ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- పిల్లల ఎదుగుదలను పరిశీలించేందుకు గ్రోత్ మానిటరింగ్ పరికరాలను కొనుగోలు చేసి ప్రభుత్వం అందిస్తోంది.
- గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోం రేషన్(టీహెచ్ఆర్) పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చింది.